సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం ; 2 ; జనవరి ; 2024



'సంజీవని'కి సలాం..!

ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తోంది 'సంజీవని నిధి' పేరుతో ప్రారంభించిన డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



ధాన్యం నిల్వలో జాగ్రత్తలు

పంటను సకాలంలో కోసి కళ్లాలకు చేర్చడంతో పాటు ధాన్యాన్ని నిల్వ చేయడంలో జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

రేంజ్ ఐజీగా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ



ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇక్కడే ఐజీ హోదాలో కొనసాగుతారు. అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తదితర ఉత్తరాంధ్ర పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

2,621 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సివిల్ సప్లయిస్ డీఎం గణేష్‌కుమార్

రాజవొమ్మంగి: జిల్లాలోని 22 మండలాల్లో ఇంత వరకు రైతుల నుంచి 2,621 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు సివిల్ సప్లయిస్ డీఎం గణేశ్‌కుమార్ తెలిపారు. అత్యధికంగా దేవీపట్నం మండలంలో 1,385 టన్నులు కొనుగోలు చేసినట్టు చెప్పారు. గంగవరం మండలంలో 214 టన్నులు, అడ్డతీగల మండలంలో 257 టన్నులు, రాజవొమ్మంగి మండలంలో 535 టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. త్వరలో రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందని తెలిపారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు తమ దగ్గరలో గల ధ్యానం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. ఇందు కోసం ఆర్బీకేల్లో వీఏఏల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు.

జెండా కొండపై పర్యాటకుల సందడి



జెండా కొండపై మంచు అందాలను ఆస్వాదిస్తున్న సందర్శకులు

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొంది, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మ పర్వతం (జెండా కొండ)కు సోమవారం పర్యాటకులు భారీగా తరలివచ్చి, సందడి చేశారు. ఆదివారం ఒలుబెడ్డ గ్రామానికి చేరుకుని అక్కడ నుంచి కాలినడకన కొండపైకి వెళ్లారు. అక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని రాత్రి బస చేసి, నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం వేకువ జామున మంచు అందాలు, అందమైన సూర్యోదయాన్ని తిలకించారు. కొండపైకి ఉన్న తేనెపట్టు గుహలు, ధింసాలాళ్లను సందర్శించారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యం ఎంతో అవసరమని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను సోమవారం తన చాంబర్‌లో ఆ సంఘం ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమారి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఆర్జేడీ కార్యాలయ పరిధిలో ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ డి. గోపినాథ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుశ్రీను, నాగేశ్వరరావు, నాయకులు ఫణి, ప్రభాకర్, మురళీ పాల్గొన్నారు.

ఈఈగా కొండయ్యపడాల్



సాక్షి,పాడేరు: పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ రెగ్యులర్ ఈఈగా టి.కొండయ్యపడాల్‌కు పదోన్నతి కల్పిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది నుంచి ఆయన పాడేరు ఐటీడీఏలోని పీఆర్ విభాగంలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి పొందిన ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈఈగా బాధ్యతలు చేపట్టిన కొండయ్యపడాల్ మాట్లాడుతూ పాడేరు డివిజన్‌లో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా గిరిజన అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వెల్‌కమ్ టు వైజాగ్





అనంతగిరిలో రిసార్టులు

- పర్యాటకుల తాకిడితో ఈ ఏడాది ఉమ్మడి విశాఖలో ఉత్సాహం
- 1.71 కోట్ల మంది టూరిస్టులు రాక
- పర్యాటక ప్రాంతాలకు వచ్చిన 40,749 మంది విదేశీ పర్యాటకులు
- దేశ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త ప్రాజెక్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది మరింత ఫుట్‌ఫాల్ పెరిగేందుకు అవకాశాలు



విశాఖకు రాబోతున్న ఒబెరాయ్ హోటల్

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం ప్రాజెక్టులు **64**

మొత్తం నిధులు రూ.**8,806.44** కోట్లు

ఉపాధి కల్పన **18,205** మందికి

2023లో జిల్లాను సందర్శించిన పర్యాటకుల వివరాలివీ...

నెల	స్వదేశీ పర్యాటకులు	విదేశీ పర్యాటకులు	మొత్తం
జనవరి	15,24,303	2,416	15,26,719
ఫిబ్రవరి	12,47,028	3,665	12,50,693
మార్చి	12,92,904	3,881	12,96,785
ఏప్రిల్	13,97,610	3,141	14,00,788
మే	14,62,051	3,158	14,65,240
జూన్	14,55,946	2,476	14,58,453
జూలై	15,61,177	3,157	15,64,347
ఆగస్ట్	13,57,313	2553	13,59,866
సెప్టెంబర్	12,40,029	2,484	12,42,676
అక్టోబర్	16,33,198	3,551	16,36,778
నవంబర్	14,03,131	4,370	14,07,524
డిసెంబర్	15,62,745	5,897	15,68,642
మొత్తం	1,71,37,435	40,749	1,71,78,184

సాక్షి, విశాఖపట్నం : అందాల ఉమ్మడి విశాఖ జిల్లా.. పర్యాటక రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. కోవిడ్ తర్వాత ఎన్నడూ రానంతగా దేశ, విదేశీ పర్యాటకులు క్యూ కడుతున్నారు. వివిధ దేశాల నుంచి జిల్లాలో ప్రకృతి రమణీయతను సందర్శించే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. 2023 సంవత్సరంలో ఏకంగా 1.71 కోట్ల మంది పర్యాటకులు విశాఖ అందాలను వీక్షించారు. కొత్త కొత్త పర్యాటకులకు వారి అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కొత్త ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి. గతంతో పోలిస్తే.. ఈ ఏడాది వచ్చిన పర్యాటకుల సంఖ్య పెరిగిందని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. కోవిడ్ తర్వాత పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్న తరుణంలో గత మూడేళ్ల కాలంతో పోలిస్తే.. 2023లో ఫుట్‌ఫాల్ ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

రూ.8,800 కోట్లు..

18 వేల మందికి ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగగా ఇందులో సగం వరకూ అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడంవిశేషం. మొత్తం రూ.8806.44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ వంటి హోటల్స్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది, త్వరలోనే మిగిలిన ప్రాజెక్టులూ పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉన్నాయి.

పర్యాటక ప్రాజెక్టుల రాకతో కళకళ

పెరుగుతున్న పర్యాటకానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పర్యాటక శాఖ సిద్ధమవుతోంది. డొమెస్టిక్‌తో పాటు విదేశీయులని మెప్పించే విధంగా ఆహారంతో పాటు సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గతేడాది మార్చిలో జరిగిన జీఐఎస్–2023లో విశాఖలో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు కీలక ఎంవోయూలు జరిగాయి. ఉమ్మడి విశాఖజిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులతో రూ.8800 కోట్లకుపైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు రానున్నాయి. అల్లూరి జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోనూ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ–అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్‌థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ క్యుజన్ రెస్టారెంట్స్ కూడా రాబోతున్నాయి.

కొత్త ప్రాజెక్టులతో మరింత కళ రాబోతోంది



సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విభిన్నమైన ఒప్పందాలు చేసుకుంది. ఇప్పటికే అన్నవరంలో దిగ్గజ సంస్థ ఒబెరాయ్ తమ ప్రాజెక్టు ప్రారంభించేందుకు 40 ఎకరాలు కూడా సిద్ధమయ్యాయి. అదేవిధంగా.. పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో భూ కేటాయింపు ప్రక్రియ చురుగ్గా కదులుతోంది. వీలైనంత త్వరగా ప్రాజెక్టులు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. చాలా సంస్థలు విశాఖలో తమ పర్యాటక వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు ఆసక్తి చూపించాయి. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి దేశ విదేశీ సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

- కలెక్టర్ సుమిత్ కుమార్
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



ఎంపీ గొడ్డేటి మాధవికి శుభాకాంక్షలు తెలుపుతున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కిముడు శివరత్నం



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు

సాక్షి,పాడేరు: నూతన సంవత్సరం ప్రారంభం రోజు నుంచి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధికి అధికారులు పునరంకితం కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీమెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్భ నర్సింగరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. పలు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డిలకు వారి కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ,ఉపాధ్యాయులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఐటీడీఏ ఉద్యోగులు పీవో అభిషేక్‌ను పూలమాలతో ఘనంగా సన్మానించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు జేసీ, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్‌లకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి క్యాంపు కార్యాలయంలోను న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. అరకు,పాడేరు నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు,అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఎంపీ మాధవికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు,ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జీకే వీధి జెడ్పీటీసీ శివరత్నం దంపతులు ఎంపీ మాధవికి పండ్లు,స్వీట్లు అందజేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల ప్రజాప్రతినిధులు,అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ట్రై కార్ చైర్మన్ సతక బుల్లిబాబుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగ,ఉపాధ్యాయులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు సకాలంలో రుణాలు

డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



కేక్ కట్ చేస్తున్న కోలా గురువులు

విశాఖ విద్య: రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో అందించనున్నట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కోలా గురువులు తెలిపారు. సోమవారం మద్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన న్యూ ఇయర్ కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బ్యాంకు వ్యాపారం రూ.2,500 కోట్లకు పెరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రుణాల మంజూరులో నిబంధనలు మరింత సరళతరం చేస్తూ, అధికార వికేంద్రీకరణకు అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, జనరల్ మేనేజర్లు డి.అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, డీజీఎంలు, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 3 వేలు... మురిపించ్ఛన్

నూతన సంవత్సరం ప్రారంభం రోజున అవ్వాతాతలు, అభాగ్యులకు పండగొచ్చింది. ఎన్నికల సమయంలో పింఛన్లను క్రమంగా రూ.3 వేలకు పెంచుతామని సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చారు. రూ.2,750 ఉన్న పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. దీంతో పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సామాజిక పింఛన్ పెంపు
- అవ్వాతాతలు, అభాగ్యులకు నూతన సంవత్సర కానుక
- మాటనిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం



చావిడిమామిడిలో పింఛన్ పొందిన వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: పెంచిన వైఎస్సార్ పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పండగ వాతావరణంలో ప్రారంభించారు. 22 మండలాల్లో 1,28,821 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. వారికి నెలకు రూ.3వేల చొప్పున పెరిగిన పింఛన్‌సొమ్ము రూ.39,03,77,500 నగదును ప్రభుత్వం మంజూరు చేయడంతో పంపిణీ ప్రారంభించారు.

ఇంటి వద్దకే పింఛన్

గత ప్రభుత్వ హయాంలో ఇచ్చే తక్కువ పింఛన్ సొమ్ము కూడా ప్రతినెల సక్రమంగా అందేది కాదు. పింఛన్‌దారులు పంచాయతీ కార్యాలయాల చుట్టూ పది రోజుల పాటు కాళ్లరిగేలా తిరిగి తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సామాజిక పింఛన్‌దారులకు ప్రతినెల 1వతేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే నగదు అందజేస్తుండడంతో కాళ్లరిగేలా తిరిగే బాధ వృద్ధులకు తప్పింది.

పింఛన్ వివరాలు

- వృద్ధాప్య, చేనేతకార్మికులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోంది.
- పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000 పెంచారు. ప్రతి నెలా 1,28,821 మందికి పంపిణీ చేయనున్నారు. పింఛన్ల పంపిణీకి జిల్లాకు రూ.39,03,77,500 మంజూరయ్యాయి.

మండలాల వారీగా పింఛన్‌దారుల వివరాలు

మండలం	పింఛన్ లబ్ధిదారులు	మండలం	పింఛన్ లబ్ధిదారులు	మండలం	పింఛన్ లబ్ధిదారులు
పాడేరు	6,788	అడ్డతీగల	5,616	జి.మాడుగుల	6,740
పెదబయలు	6,309	అనంతగిరి	6,246	గంగవరం	4,032
రాజవొమ్మంగి	6,672	అరకులోయ	6,670	జీకే వీధి	7,922
రంపచోడవరం	4,678	ఎటపాక	6,260	హుకుంపేట	7,354
వి.ఆర్.పురం	3,789	చింతపల్లి	9,702	కొయ్యూరు	7,818
వై.రామవరం	3,441	చింతూరు	5,187	కూనవరం	4,022
		దేవీపట్నం	4,492	మారేడుమిల్లి	2,060
		డుంబ్రిగుడ	6,575	ముంచంగిపుట్టు	6,448

ఆనందంగా ఉంది



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ సొమ్మును పెంచడం చాలా సంతోషంగా ఉంది. రూ.3,000 ఈనెల నుంచి పంపిణీ చేస్తుండడంతో మరింత ఆర్థిక భరోసా ఏర్పడింది. మాలాంటి వారి బాధలు తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండడం మా అదృష్టం

– మద్రి లక్ష్మమ్మ, వితంతువు, చావిడిమామిడి గ్రామం, పాడేరు మండలం

హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలుజేశారని, ఆయన చరిత్రలో గొప్ప ప్రజానాయకుడిగా నిలుస్తారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3000కు పెంచడంతో ఆ నగదు పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని కాడెలి పంచాయతీ శివారు చావిడిమామిడి గ్రామంలో సోమవారం నిర్వహించారు. పెంచిన పింఛన్ సొమ్మును ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఇతర నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే దశలవారీగా పింఛన్ నగదును రూ.3వేలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని తెలిపారు. పేదల పక్షపాతిగా సీఎం ప్రతి హామీని అమలుజేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి నవీన్, సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర,ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, కుంతూరు నరసింహమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సభ్యుడు సిరగం దశమూర్తి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షుడు సీదరి రాంబాబు, పసుపుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్బాడి రాజారావు, నాయకుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



బైక్ ప్రమాదంలో గాయపడిన గణేష్, నాగరాజు

మారేడుమిల్లి/వీఆర్‌పురం: రెండు మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడారు. మారేడుమిల్లి మండలంలోని ఉక్కులూరు గ్రామానికి చెందిన పల్లాల జాన్‌రెడ్డి సోమవారం తన గ్రామం నుంచి ఆకుమామిడికోట గ్రామానికి బైక్ పై వెళుతుండగా ప్రముఖ పర్యాటక ప్రదేశం గుడిసె వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో జాన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బోదులూరు పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

● వీఆర్‌పురం మండలం చినమట్టపల్లి గ్రామానికి చెందిన కారం నాగరాజు, ఎం.గణేష్‌లు బైక్‌పై స్వగ్రామం నుంచి సోమవారం రేఖపల్లిలో జరిగే వారపుసంతకు వెళ్లారు. సాయంత్రం చినమట్టపల్లికి అదే బైక్‌పై పయనమయ్యారు. వారు రేఖపల్లి శివారున ఇటుకల బట్టీ ప్రదేశంలోని మూల మలుపు వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో భద్రచలం తీసుకెళ్లినట్టు ఈఎంటీ శ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

వెంకన్నకు నవనీత సేవ



నవనీత అలంకరణలో వెంకన్న

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వామి వారికి నవనీత సేవ ఘనంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై పారాయణం, సుప్రభాత సేవ, విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం 27 కిలోల వెన్నతో స్వామిని అలంకరించారు. ఆలయ ప్రధాన పురోహితుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో విశేష అర్చనలు జరిపారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

ముగిసిన ఏకపాత్రాభినయ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పీఎం పాలెం: శిల్పారామం(జాతర) ఆడిటోరియంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర కళాకారుల ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం 7వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 22 మంది కళాకారులు పోటీ పడి ప్రదర్శించారు. రాజాంకు చెందిన బండి కుమారి హరిశ్చంద్ర నాటకంలోని చంద్రమతి పాత్రకు ప్రథమ బహుమతి, పార్వతీపురానికి చెందిన నక్షత్ర పాత్రధారి తూడి భాస్కరరావుకు ద్వితీయ, కల్యాణి పిగకల సీను సత్యహరిశ్చంద్ర నాటకంలో నటనకు బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న నటులందరికీ మెమోంటోలు బహూకరించి సత్కరించారు. చివరగా ప్రదర్శించిన నక్కీర, సత్యహరిశ్చంద్ర నాటకాలు ఆహూతులను అలరించాయి. పౌరాణిక పద్యనాటక రంగానికి విశేష సేవలు అందించిన కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు, కళారత్న అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్, కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన శుభాకాంక్షలు




అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు




కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, జేసీ కార్తీక్



పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నర్సింగరావుకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, నేతలు

సాక్షి, పాడేరు: నూతన సంవత్సరం వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు, పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్, సూరజ్‌గనోరే, చైతన్య, సబ్ కలెక్టర్‌లు ధాత్రిరెడ్డి, ప్రశాంత్‌కుమార్‌లకు ప్రజాప్రతినిధులు, ఇతర శాఖాధికారులు తదితరులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల్లో సందడి నెలకొంది. రంపచోడవరంలో జరిగిన న్యూ ఇయర్ వేడుకలో ఏపీ ఓ జనరల్, సిహెచ్ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డి.ఎస్.శాస్త్రి, జేసీసీ డీఎం పార్వతీశ్వరరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, కార్యదర్శి ఫయాజ్ భాషా, ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఉన్నారు.



అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు



రంపచోడవరంలో నూతన సంవత్సర వేడుకల్లో సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



ఐటీడీఏ కార్యాలయంలోని వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- 12 శాతం తేమ ఉండే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలి



యంత్రం సహాయంతో వరి పంటను నూర్పుతున్న రైతులు



కోసిన వరి చేనును పొలంలో ఆరబెడుతున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను సకాలంలో కోసి కళ్లాలకు చేర్చడం ఒక ఎత్తయితే, దాన్ని సకాలంలో నూర్పిడి చేసి ధాన్యాన్ని ఏడాది తిండి గింజల కోసం, ధర వచ్చినప్పుడు అమ్ముకోవాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించకపోతే ఏడాది పొడవున దాచే ధాన్యం దెబ్బతింటాయి. రైతన్న కష్టమంతా వృథా అయి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ చెబుతూ.. పలు సూచనలు చేశారు.

- నూర్చిన ధాన్యాన్ని 12 శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టాలి.
- రసాయన ఎరువులను ధాన్యంపై నేరుగా పిచికారీ చేయకూడదు. ఇలా చేస్తే విష ప్రభావం ఎక్కువగా ఉండి ఆరోగ్యాలు దెబ్బతింటాయి.
- ధాన్యంపై కీటకాలు, పురుగులు ఆశించకుండా వేపాకు, సీతాఫలం గింజలు, వెల్లుల్లి, ఉసిరి గింజలను పొడి చేసి రెండు శాతం వరకు పొడిని ధాన్యంలో కలపాలి.
- ఇలా చేస్తే ఎనిమిది నెలల వరకు ధాన్యంలో పురుగు చేరకుండా ఉంటుంది.
- ఉత్తరేణి, కసివింద, ఉమ్మెత్త, మిరప, వేపాకులను ధాన్యం బస్తాల్లో కలిపి ఉంచిన నాలుగు నెలల వరకు ధాన్యంలో పురుగు చేరదు.

గోదాముల్లో ధాన్యం నిల్వ...

- గోదాముల్లో ధాన్యం నిల్వ చేసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- గోదాము నేలపైన, గోడలకు, పై కప్పులకు రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.
- తుపాను గాలులకు పై కప్పులు ఎగిరి పోకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- రంధ్రాలుంటే సిమెంట్‌తో ముందుగా పూడ్చాలి.
- ధాన్యం నిల్వలకు పాత గోనె సంచులను ఎక్కువగా ఉపయోగించరాదు.
- గోనె సంచులను ముందుగా 2 మిల్లీలీటర్లు మలాథియాన్ మందును లీటరు నీటిలో కలిపి పది నిమిషాలు మందు ద్రావణంలో నానబెట్టి ఎండలో ఆరబెట్టాలి.
- గోదాము గోడలకు, నేలపై పురుగు ఆశించకుండా 10 మిల్లీలీటర్లు మలాథియాన్ మందును లేదా 7 మిల్లీలీటర్లు డైక్లోర్‌వాస్ మందును నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చెక్క బల్లలపై ధాన్యం బస్తాలు వేసుకుంటే తేమ తగలకుండా ఉంటుంది.
- గోడలకు, పై కప్పుకు ధాన్యం బస్తాలు తగలకుండా నిట్ట వేసి, వర్షం నీరు గోదాముల్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువ కాలం ధాన్యం నిల్వ ఉంచకుండా సకాలంలో అమ్ముకుంటే రంగు మారదు. దిగుబడితో పాటు నాణ్యత ఉంటుంది.
- బస్తాలను 1–2 అడుగుల ఎత్తులో బెంజీలు, అరుగుల మీద వేస్తే భూమిపై ఉన్న తేమ లాక్కోదు.

అకాల వర్షాలకు పంట తడిస్తే..

- గాలి వర్షాలకు పండిన పంట నేలకొరిగితే వెంటనే వరి పంటను నిలబెట్టి కట్టలుగా కట్టాలి.
- కోసిన వరి పనలు తడిస్తే ఎండ తగిలేలా తడి ఆరేలా ఆరబెట్టాలి. గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి.
- వర్షం తగ్గని పరిస్థితుల్లో తడిచిన వరిని కుప్పలు పెడితే వరి పనలపై ఎకరాకు 25 కేజీల ఉప్పును చల్లి కుప్ప పెట్టాలి.
- తడిచిన ధాన్యం ఆరబెట్టడానికి వీలు కాకపోతే మొలకెత్తకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊకను కలిపి పోగు పెడితే మొలకెత్తకుండా జాగ్రత్తపడొచ్చు.

మెలకువలు పాటించాలి



జిల్లాలో ఈ ఏడాది లక్షా 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుతం నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, ఎద్దుల సహాయంతో జోరుగా నూర్పుతున్నారు. పంట నూర్చి ధాన్యాన్ని భద్రపరచడంలో మెలకువలు పాటించాలి. నూర్చిన ధాన్యంలో 14 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా సకాలంలో అమ్మకాలు చేయడం, మిల్లులో బియ్యంగా ఆడించడం, ఎలుకలు సమస్య లేకుండా చూస్తే నష్టాలుండవు.

– కె. రాజ్‌కుమార్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, కొండెంపూడి, బుచ్చెయ్యపేట మండలం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



పూజలు చేస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఈపూజ నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. తులసి ప్రసాదం భక్తులకు అందజేశారు.

నేడు వైఎస్సార్ పింఛన్ పంపిణీ ప్రారంభం

సాక్షి, పాడేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 11గంటలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, పింఛన్‌దారులకు ప్రభుత్వం పెంచిన రూ.3000 పింఛన్‌ను పంపిణీ చేస్తారని తెలిపారు. నామినేటెడ్ చైర్మన్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జిల్లా,మండల పార్టీ కార్యవర్గం,సీనియర్ నాయకులు,కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

- రంపచోడవరం ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన
- ఏఎస్పీ హామీతో ఆందోళన విరమణ

మారేడుమిల్లి: మారేడుమిల్లి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల సమీపంలో కారు ఢీకొట్టి విద్యార్థి మృతి చెందిన సంఘటనలో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మారేడుమిల్లిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కళాశాలకు చెందిన నేరం సత్యవరప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. కానిస్టేబుల్ ఉదయభాస్కర్ కారును అతివేగంగా నడిపి నడిచి వెళ్తున్న విద్యార్థులను ఢీకొట్టడంతో ఒక విద్యార్థికి స్వల్ప గాయాలు కాగా, సత్య వరప్రసాద్ మృతి చెందాడు. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సోమవారం పోస్టుమార్టం ముగిసిన తర్వాత రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద విద్యార్థి బంధువులు ప్రజా సంఘాల నాయకులు, సీపీఎం పార్టీ నాయకులు న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్‌అడహళ్లి అక్కడికి వెళ్లారు. ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. డిడి జాన్ రాజు మాట్లాడుతూ విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దీంతో వారు ఆందోళన విరమించారు. మారేడుమిల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.ఉదయ భాస్కర్‌పై కేసు ఫైల్ చేసి అదుపులో తీసుకున్నామని, అతని శాంపిల్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ కి పంపించామని ఎస్‌ఐ రాము తెలిపారు.



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మృతుడి కుటుంబ సభ్యులు

‘సంజీవని’కి సలాం..!

- కలెక్టర్ చొరవతో.. నిరుపేదలకు ఆపన్నహస్తం
- సంజీవని నిధి పేరుతో డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్
- న్యూ ఇయర్ రోజున వెల్లువెత్తిన ఉదారత
- స్వచ్ఛందంగా రూ.14,22,368ల విరాళాలు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, చిత్రంలో జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం : చేయూతనందిస్తే తప్ప.. ఏ సాయాన్ని పొందలేని అభాగ్యులు, నిరాశ్రయులు, నిరుపేదలను ఆదుకునేందుకు కలెక్టర్ చూపించిన వినూత్న చొరవ అద్భుత ఫలితాలను అందిస్తోంది. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించేందుకు గతేడాది జనవరిలో కలెక్టర్ డా.మల్లికార్జున 'సంజీవని నిధి' పేరుతో డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌ను ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల నుంచి సంజీవని నిధికి విశేష స్పందన లభించింది. వచ్చిన నిధులతో మంచి కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ న్యూ ఇయర్ సందర్భంగా మరోసారి సంజీవని నిధికి విరాళాలిచ్చి.. అభాగ్యులపై ప్రేమను కురిపించాలని కలెక్టర్ ఇచ్చిన పిలుపు మేరకు.. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉదారతను చూపించి మొత్తంగా రూ.14.22 లక్షల విరాళాలు అందించారు. జీవితంలో ఏదో ఒక మంచి పని చెయ్యాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. ఆ మంచి ఎదుటివారి మేలు కోరేలా వారి జీవితాలకు చేయూతనందించేలా ఉండాలన్నదే ప్రతి ఒక్కరి ఆలోచన. ఆ ఆలోచనకు ఒక రూపమిస్తూ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున రాష్ట్ర స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ మాదిరిగా.. జిల్లా స్థాయిలో 'సంజీవని నిధి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎవరికి తోచిన సాయాన్ని వారు సంజీవని నిధికి అందిస్తే ఆ డబ్బులతో కష్టాల్లో ఉన్న వారికి సాయమందించేందుకు వినియోగించాలన్న మంచి ఉద్దేశంతో కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు వచ్చేవారు.. స్వీట్లు, బొకేలు, పండ్లు తీసుకురావద్దనీ.. శక్తి మేర సంజీవని నిధికి విరాళమివ్వాలని గతేడాది పిలుపునిస్తూ మొదలు పెట్టారు. అప్పటి నుంచి మంచి స్పందన లభించింది. ఈ ఇయర్ కూడా.. ప్రభుత్వ ఉద్యోగులు తోచిన సాయం చేస్తూ.. నిధిని మరింత పెంచారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేలా...

అనాథలు, దివ్యాంగులు, బుద్ధిమాంద్యం పిల్లలు, హెచ్‌ఐవీ, కుష్టు బాధితులు, అసాధారణ, ప్రత్యేక సందర్భాల్లో వైద్య ఖర్చులు అవసరమైన వారికి ఈ సంజీవని నిధిని వినియోగించాలన్నదే దీని ముఖ్య ఉద్దేశం. ఈ ఉద్దేశానికి అనుగుణంగా ఇందులోకి వచ్చిన విరాళాలను కలెక్టర్ ఉదారంగా అందిస్తూ.. వారిని ఆదుకుంటున్నారు. కోవిడ్ ప్రభావిత పిల్లలకు సహాయం, అనాథ పిల్లలకు విద్య, పేద, మెరిట్ విద్యార్థులకు స్పెషల్ ఎడ్యుకేషన్ అందించేందుకు మద్దతునందించారు. ఎవరికైనా సాయం కావాలంటే కలెక్టరేట్ ఆవరణలో దరఖాస్తును ఫిర్యాదుల విభాగంలో అందజేయాలి. వాటిని కలెక్టర్ పరిశీలించి విచారణ నిర్వహించి కచ్చితంగా అవసరమని అనుకుంటే వెంటనే సాయమందిస్తున్నారు.

ఈ న్యూ ఇయర్‌రోజున విరాళాలిలా వచ్చాయి...

- కలెక్టర్ మల్లికార్జున తన ఒక నెల జీతం రూ.1,10,000/– అందజేశారు.
- కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది రూ.12,000 విరాళమిచ్చారు.
- రెవెన్యూ డిపార్టుమెంటులో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగులు రూ.3,85,000 అందించారు.
- వీఎంఆర్డీఏ ఉద్యోగులు రూ.1,79,523
- విద్యాశాఖ రూ.1,05,000
- ఆరోగ్య శాఖ రూ.95,000
- పశు సంవర్ధక శాఖ రూ.50,000
- జిల్లా పరిషత్ విభాగం రూ.50,000
- కో–ఆపరేటివ్ విభాగం రూ.50,000
- ఆఫీసర్స్ క్లబ్, విశాఖపట్నం రూ.1,00,000
- వివిధ శాఖల ఉద్యోగులు రూ.2,85,845
- మొత్తం వచ్చిన విరాళాలు– రూ.14,22,368

ఉద్యోగులు ముందుకొస్తున్నారు



సంజీవని నిధికి విరాళాలందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నతంగా ముందుకొస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇందులో వచ్చిన నిధులతో మంచి కార్యక్రమాలు నిర్వహించాం. ఉదాహరణకు గతేడాది రూ.17 లక్షల వరకూ వచ్చాయి. వీటిలో 512 మంది ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు రూ.1.34 లక్షలు వినియోగించి నిర్మయ హెల్త్ స్కీమ్‌లో భాగంగా ఆరోగ్య బీమా చేశాం. వివిధ ఇబ్బందులతో బాధపడుతున్న ఏడుగురికి రూ.1.30 లక్షలు అందించాం. ఇలా మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నాం. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి విరాళాలు అందించాలనుకుంటే సంజీవని–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ పేరుతో డీడీలు, చెక్కులు రూపంలో విరాళాలు ఇవ్వాలని కోరుతున్నాం.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ (డబ్ల్యూఎంపీఎస్‌సీ) సహకారంతో ప్లంబర్లకు ఒక రోజు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. నేక్ శిక్షణా కేంద్రం, గాజువాకలో శిక్షణ ఇస్తామన్నారు. స్టేషనరీ ఉచితంగా ఇస్తామని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 91332 42666 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

మేడ పైనుంచి పడి యువకుడి మృతి

బీచ్ రోడ్డు: ప్రమాదవశాత్తు మేడ పైనుంచి పడి ఒక యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లోని ఒక రెస్టారెంట్‌లో అసిస్టెంట్ కుక్‌గా పని చేస్తున్న గణేష్ దాసు(36) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం మేడ పైనుంచి ప్రమాదవశాత్తు కిందకి పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడిది ఒడిశా రాష్ట్రం కాగా.. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.